www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 13 మే 2025

5

తిరుపతి

కలెక్టర్‌ను కలిసిన డిపిటిఒ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

జిల్లా ప్రజా రవాణా అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకటరావు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీఎస్ఆర్టీసీ అభివద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటిఎం విశ్వనాథ్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గంగమ్మ' జాతర

- లక్ష మంది భక్తులు వస్తారని అంచనా
- ఆలయంలో భారీ బందోబస్తు
- ఏర్పాట్ల పర్యవేక్షణలో ఎంఎల్ఎ, కమిషనర్
- చికెన్, మటన్ ధరలు మూడింతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా జరగనుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు లక్ష మంది పైనే భక్తులు వస్తారన్న అంచనాతో ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాస్, కమిషనర్ ఎన్.మౌర్య ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈనెల 6వ తేదీ చాటింపుతో జాతర ప్రారంభమయ్యింది. రోజుకో వేషధారణతో భక్తులు గంగమ్మను వారం రోజుల పాటు దర్శించుకున్నారు. 13వ తేదీ వైభవంగా జాతర జరగనుంది. 14వ తేదీ బుధవారం తెల్లవారుజామున అమ్మవారి చెంప నరికి జాతరను ముగించనున్నారు. జాతర సందర్భంగా పొటేళ్లు, కోళ్ల మూడింతలు ధరలు పలుకుతున్నాయి.

గత ఏడాది కన్నా ఈ ఏడాది భిన్నంగా సాంప్రదాయ పద్ధతిలో జాతర ఏర్పాటు చేశారు. గంగమ్మ గుడి కమిటీని రాష్ట్ర ప్రభుత్వం వేయకపోవడంతో 26 మంది ఉత్సవ కమిటీ పేరుతో సభ్యులను నియమించింది.ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. భక్తులు జాతర రోజు పొంగళ్ళు పెట్టుకోవడానికి మున్సిపల్ ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేశారు. అలాగే ద్విచక్ర వాహనాలు, కార్ పార్కింగ్ పెట్టుకోవడానికి ఇందిర మైదానాన్ని ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా ఆలయ పరిసరాల్లో పలు రోడ్లను మూసివేసి బారికేడ్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో జరిగే ప్రముఖ జాతరల్లో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు ఎంతో విశిష్టత ఉంది. ప్రతీ ఏటా మే నెలలో ఏడు రోజుల పాటు జాతర నిర్వహించటం ఆనవాయితీ. చాటింపు ప్రకటించిన తరువాత సహజంగా తిరుపతిని విడిచి జనం ఊరు విడిచి వెళ్లకపోవడం గమనార్హం. ఇతర ప్రాంతాల నుంచి ఎవరైనా వచ్చినా రాత్రుల్లో బస చేయకుండా వెళ్లిపోతుంటారు. తాతయ్యగుంట గంగమ్మ జాతరకు 900 ఏళ్ల చరిత్ర ఉంది. గ్రామదేవతగా అవతరించిన గంగమ్మను సాక్షాత్తు తిరుమల శ్రీవారి చెల్లెలుగా కొలుస్తారు.

నాటుకోడి రూ.2వేలు

తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం జంతు బలి ఇచ్చేందుకు ఇటు నాటుకోడి ఒక్కొక్కటి సైజును బట్టి 1500 రూపాయల నుంచి 2000 రూపాయలు పలుకుతా ఉంది. జాతర సందర్భంగా ఇదే అదనుగా కోళ్ల అమ్మే వ్యాపారులు ధరలు పెంచేశారు. అలాగే నాటు కోడి పేరు చెప్పి తమిళనాడు నుంచి ఇతర కోళ్లు తీసుకొచ్చి ఇదే నాటుకోడి అని అంటూ అమ్మకాలు చేస్తున్నారు. మార్కెట్లో నాటు కోడి కిలో 400 రూపాయలు ధర పలుకుతోంది. అలాగే పొట్టేలు 10 కేజీలు 12 వేల రూపాయలు ధర పలుకుతుంది. మేకపోతు 10 కేజీలు 11 వేలు రూపాయలు నుంచి 12వేలు పలుకుతుంది. మామూలు సీజన్ అయితే మేకపోతు 10 కేజీలు 7 నుంచి 8 వేల రూపాయలు ధర పలికేది. అలాగే కిలో మల్లిపూలు 500 రూపాయలు ధర మార్కెట్లో పలుకుతా ఉంది. సన్నజాజి పూలు కిలో 450 ఉంది. జాతర సందర్భంగా ధరలు ఎక్కువగా పలుకుతుండడంతో సామాన్య ప్రజలు విల విలలాడిపోతున్నారు.



గంగమ్మకు సారె సమర్పిస్తున్న కమిషనర్ మౌర్య

సున్నపుకుండ వేషధారణలో..

తిరుపతి తాతయ్య గుంట గంగమ్మను తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష సోమవారం దర్శించుకున్నారు. సోమవారం సున్నపుకుండలు వేషాల్లో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో జయకుమార్ ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జాతరకు సర్వం సిద్ధం : ఎంఎల్ఎ

గంగమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జరిగే జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలకుగండా అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసినట్లు విలేకరుల సమావేశంలో చెప్పారు. 400 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టిటిడి, మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, తుడా అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూస్తున్నారని చెప్పారు. మంగళవారం ఉదయం విఐపిలకు ఉదయం 6 నుంచి 8 గంటలు వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల మధ్య దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, సుధాకర్, బాబ్జి, ఆముదాల వెంకటేష్, టౌన్ బ్యాంక్ డైరక్టర్ అనీల్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం ఆపాలి..!

ఉపాధ్యాయుల బదిలీ సమస్య పరిష్కరించాలి

డిఇఒ కార్యాలయాల ఎదుట యుటిఎఫ్ ధర్నాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పాఠశాలల పున్ణవ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కార నిమిత్తం పాఠశాల విద్యాశాఖ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సోమవారం చిత్తూరు, తిరుపతి డిఇఒ కార్యాలయాల ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాలు జరిగాయి.

ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల సమస్యలు పరిష్కరించని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డిజె రాజశేఖర్, ముత్యాలరెడ్డి డిమాండ్‌చేశారు. యుటిఎఫ్ పిలుపు మేకు సోమవారం తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. 117 జీవో రద్దు చేసి, దాని స్థానంలో కొత్త జీవో తీసుకొచ్చి దాని ఆధారంగా పాఠశాలలను పున్ణవ్యవస్థీకరించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:20 ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులను బోధించడానికి ఐదుగురు టీచర్లను నియమించాలన్నారు. విద్యార్థుల సంఖ్య 75కు మించితే పిఎస్‌హెచ్‌ఎం పోస్ట్ అదనంగా ఇవ్వాలన్నారు. ఉర్దూ మైనర్ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్జీటీ స్కూల్ అసిస్టెంట్లతో కలిపి లెక్కించి పోస్టులు కేటాయించడం సరికాదు. ఆ పోస్టులు అదనంగా ఇవ్వాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియం కొనసాగించాలి .ఉన్నత పాఠశాలల్లో తరగతి రోల్ 45 మించినప్పుడు రెండవ సెక్షన్ ఏర్పాటు చేయాలని, సదనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్ జి టి లకు మ్యానువల్ గా బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టాలి .స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు బదిలీల్లో కొత్తగా మంజూరు చేసిన పోస్టులు ఖాళీలుగా చూపించాలి .ప్లస్ టు హైస్కూల్లో ఖాళీగా ఉన్న పీజీటీ పోస్టులు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లతో ముందుగా భర్తీ చేసిన తర్వాత స్కూల్ అసిస్టెంట్ బదిలీలు చేపట్టాలి .ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో ఉన్న అసంబద్ధతలను తొలగించి సవరించాలన్నారు. ధర్నా అనంతరం జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రమణకు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు దండు రామచంద్రయ్య, సహాధ్యక్షులు కుమారస్వామి, ఈ గీతమ్మ, కోశాధికారి మోహన్ బాబు, నాయకులు సూర్య ప్రకాష్, జిల్లా కార్యదర్శులు బండి మధుసూదనారెడ్డి, సురేష్, మస్తానయ్య, పద్మజ, హేమంభదర రావు, ఆదినారాయణ, గోవర్ధన రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల నిరసన

సిహెచ్‌ఒల సమస్య పరిష్కరించాలి

సిఐటియు మద్దతు

సంఘీభావం ప్రకటించిన కందారపు మురళి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

రాష్ట్రవ్యాప్తంగా 14 రోజులుగా నిరవధికంగా సమ్మెలో ఉంటూ పోరాడుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యను మానవతాదృష్టితో రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి విజ్ఞప్తి చేవారు. తిరుపతి డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద సోమవారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేస్తున్న పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని, జాబ్ చార్ట్ రూపొందించాలని, బకాయిలు లేకుండా వేతనాలు, అద్దె చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారని, అయితే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యప్రసాద్ వారిని అవమానించడాన్ని తప్పుబట్టారు. 'మీ వల్ల ఉపయోగం లేదు.. తొలగిస్తే రూ.500 కోట్లు మిగులుతుంది' అని బాధ్యతారాహిత్యంగా మంత్రి మాట్లాడటంపై అభ్యంతరాన్ని తెలిపారు. చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని కోరడం నేరమా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నేతలు ఎస్ జయచంద్ర, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె కుమార్, స్విమ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రవి సంఘీభావం ప్రకటించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ యూనియన్ నాయకురాళ్లు సుమలత, మేరీ కపావతి, సౌమ్య, ప్రవల్లిక, నళిని, ఫీబా, గాయత్రి, పున్యేన మాధురి, మోహన్, లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు అభినందనీయం

గూడూరులో కేక్ కట్‌చేసి...

ప్రజాశక్తి - తిరుపతి సిటి, గూడూరు టౌన్

వైద్యరంగంలో నర్సుల సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. స్విమ్స్ పద్మావతి ఆడిటోరియంలో సంచాలకులు డాక్టర్ ఆర్‌వి కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సునీత, కాలెజి ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధారాణి, కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపి ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి, ఫార్మా కాలేజీ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎర్రమరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళి అర్పించారు. డాక్టర్ ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ వైద్యరంగంలో నర్సింగ్ వృత్తి మహోన్నతమైనదన్నారు. ఇప్పటికీ నైటింగేల్‌ను స్మరించుకుంటున్నామంటే ఆమె అందించిన సేవలు ఎంత గొప్పవోనని ప్రశంసించారు. లింగ వివక్షకు తావులేకుండా మహిళలతో పాటు, పురుషులకు నర్సింగ్ విద్యను స్విమ్స్ నర్సింగ్ కళాశాలలో బోధించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా కరోనా కాలంలో నర్సులు అందించిన సేవలు వెలకట్టలేమన్నారు. 2025 థీమ్ 'మన నర్సులు మన భవిష్యత్' అని పేర్కొన్నారు.

గూడూరు టౌన్ : రోగులకు దగ్గరుండి వైద్య సేవలు అందించే నర్సులు అభినందనీయమని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా తెలిపారు. ప్రపంచ నర్సింగ్ దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.గడియారం స్థంభం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. డాక్టర్ షరీనా మాట్లాడుతూ.రోగులతో ఎక్కువ సమయం గడిపేది నర్సులేనని తెలిపారు. డాక్టర్లుగా కొద్ది సేపు మాత్రమే వారితో మాట్లాడుతామని,రోగికి వ్యాధి నయం అయ్యే వరకు ఉండేది నర్సులేనన్నారు.రోగులకు వారు అందించే వైద్య సేవలు అభినందనీయమని వివరించారు.ఈ కార్యక్రమంలో మైథిలి నర్సింగ్ కళాశాల నిర్వాహకులు ఎల్.వి రమణ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణరథంపై మెరిసిన 'పద్మావతి'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం స్వర్ణరథంపై అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను ఊరేగింపుగా స్వర్ణరథం మంటపానికి తీసుకొచ్చారు. ఉదయం 9.45 గంటల నుండి స్వర్ణరథోత్సవం వేడుకగా జరిగింది. బంగారు రథాన్ని అధిరోహించిన అమ్మవారు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం 2.30 నుండి 4.30 గంటల వరకు అమ్మవారి ఉత్సవర్లకు శుక్రవారపు తోటలో స్నపనతిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు .రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఆలయ అర్చకులు బాబు స్వామి, డిప్యూటీ ఈవో గోవింద రాజన్, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్స్పెక్టర్లు చలపతి, సుభాస్కర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

తిరుచానూరు మాడావీధుల్లో అమ్మవారు

దేశవ్యాప్త సమ్మెకు సంసిద్ధం కావాలి : సిఐటియు

సత్యవేడు : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రమాదకరమైన లేబర్‌కోడ్లను రద్దు చేయాలని 2025, మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెకు సంసిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రచురించిన బుక్‌లెట్లను ఆటో యూనియన్ కార్మికులకు పంచిపెట్టారు. ఆటో యూనియన్ సభ్యులు పన్నీరు, మోహన్ బాబు, వినోద్, షణ్ముగం, ఏలుమలై, సురేంద్ర పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి లయన్స్‌క్లబ్ చేయూత

తిరుపతి టౌన్ :తిరుపతి భవానీనగర్‌లోని ఆదరణ వృద్ధాశ్రమానికి లయన్స్‌క్లబ్ ఆఫ్ తిరుతపి శ్రీ శ్రీనివాస ఆధ్వర్యంలో నెలకు సరిపడా టీ ప్యాకెట్లు, చక్కెర, ఉద్దిపప్పు మొదలైన రూ.15వేల విలువైన వంట సరుకులను నిర్వాహకురాలు వసంతమ్మకు అందజేశారు. లయన్స్‌క్లబ్ తిరుపతి శ్రీ శ్రీనివాస అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆవుల ఈశ్వర్‌రెడ్డి, శాంతినాడార్, శేషాద్రి పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు సోమవారం జిల్లాలో ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా మొదటి, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి సుమారు 526 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. మొదటి రోజు ఉదయం జరిగిన జనరల్ ఒకేషనల్ మొదటి సంవత్సరం పరీక్షలకు 7427 మంది దరఖాస్తు చేసుకోగా 448 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 848 మంది దరఖాస్తు చేసుకోగా 48 మంది గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి మీడియాకు వెల్లడించారు.

శ్మశాన సమస్యను వివరిస్తున్న ముస్లీం నేతలు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 28 వినతులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 28 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ఫోన్ ద్వారా ఐదు మంది తమ సమస్యలు తెలుపగా, 23 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మునిసిపల్ పార్క్ వెనుక ప్రాంతంలో చెత్త వాహనం సక్రమంగా వచ్చేలా చూడాలని, పూల మార్కెట్, సున్నపు వీధిలో ఆక్రమణలు తొలగించాలని, రాజీవ్ నగర్ లోని మసీదు వద్ద నీటి వసతి కల్పించి, మొక్కలు నాటించాలని, చేపల మార్కెట్ వద్ద శుభ్రంగా ఉంచాలని, కొంకచెన్నాయ గుంటలో అక్రమంగా వేసిన యు డి ఎస్ తొలగించాలని, వరదరాజ నగర్ పాచిగుంట వద్ద సక్రమంగా నీరు రావడం లేదని, గతంలో ఇంటికోసం డబ్బులు కట్టామని ఇళ్ళైనా, డబ్బులు ఇప్పించాలని కోరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ ఉన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయాలి

జీవకోనలోని ముస్లిమ్స్ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని రఫీ హిందుస్తానీ, చాను హిందుస్తానీ, జాకీర్ కోరారు. ఈ మేరకు గ్రీవెన్స్ సందర్భంగా కమిషనర్ ఎన్.మౌర్యను కలిసి వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వంలో ప్రహరీగోడ నిర్మించారని, గేటు, స్మశానం చుట్టూ గ్రీనరీ చెట్లు, బోరు వేసి నీటి సౌకర్యం, కర్మక్రియలకు భవనం నిర్మించాలని కోరారు.

శ్రీవాణి దర్శన టికెట్లపై దుష్ప్రచారం సరికాదు: టీటీడీ

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో ఆఫ్‌లైన్‌లో ఇస్తున్న శ్రీవాణి దర్శన టికెట్లు మిగిలి పోయాయంటూ సోషియల్ మీడియాలో కొందరు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని టీటీడీ పేర్కొంది. వాస్తవానికి ఆన్ లైన్‌లో 500 టికెట్లు, తిరుపతి ఎయిర్ పోర్ట్ లో 200 టికెట్లను అందుబాటులో ఉంచగా ఎప్పటికప్పుడు భక్తులు బుక్ చేసేసుకుంటున్నారు. ఏ రోజూ ఆన్ లైన్ లో శ్రీవాణి దర్శన టికెట్లు మిగిలిన సందర్భం లేదు. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజు 800 టికెట్లను భక్తులకు ఆఫ్ లైన్ లో జారీ చేస్తున్నారు. గత కొన్ని రోజుల్లో ఆఫ్ లైన్ లో పదుల సంఖ్యలో తగ్గాయేకాని, కొందరు వ్యక్తులు సోషియల్ మీడియాలో గతవారం రోజుల్లో వందల సంఖ్యలో టికెట్లు మిగిలిపోయినట్లు ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవం. అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీయడం తగదని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

మల్లంగుంటలో బంగారునగలు చోరీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లంగుంటలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఇంటిలో నిద్రిస్తున్న యజమానులకు చప్పిడి కాకుండా చోరులు చేతివాటం ప్రదర్శించారు. విషయం తెలుసుకున్న క్లూస్ టీం ,ఫింగర్ ప్రింట్ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 80 గ్రాముల బంగారు చోరీ జరిగిందని తిరుపతి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'వీరజవాన్'కు టిటిడి ఉద్యోగుల శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పాకిస్తాన్ – భారత్ యుద్ధభూమిలో 14 మంది పాకిస్తాన్ తీవ్రవాదులను మట్టికరిపించిన భరతమాత ముద్దుబిడ్డ వీరజవాన్ మురళినాయక్‌కు టిటిడి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో శాంతిర్యాలీ నిర్వహించి, శ్రద్ధాంజలి ఘటించారు. మురళినాయక్ నిరుపేద సుగాలి కులంలో పుట్టిన ఆణిముత్యమని, సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పుట్టగుండ్లపల్లి తాండాక వాసి అని పేర్కొన్నారు. రైల్వేలో వచ్చిన ఉద్యోగ వదులుకుని సైన్యంలో చేరారని అన్నారు. మురళీనాయక్ వీరమరణానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ టిటిడి పరిపాలనా భవనం నుంచి రెండో గేటు వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఉద్యోగ సంఘ నాయకులు జటోత్ భాస్కర్, జి.వెంకటేశం, జి.వెంకటరమణారెడ్డి, ఆనందరాజు, ఎం.ప్రసాద్‌రావు, ఎన్.కల్పన, ఎ.వాసు పాల్గొన్నారు.

తిరుపతి ఆటోమొబైల్ అసోసియేషన్ తరఫున...

"ఆపరేషన్ సింధూర్" లో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన జవాన్లకు మద్దతుగా భారత సైన్యానికి రూ. 3.15 లక్షల విరాళాన్ని అందించారు. ఈ డిమాండ్ డ్రాఫ్ట్‌ను కలెక్టర్‌కు పృథ్వీ అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతిలోని ఆటోమొబైల్ డీలర్లు పాల్గొన్నారు.

పరిపాలనా భవనం వద్ద కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి

లంచం అడిగితే సహించం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రజలకు పనులు చేసేందుకు లంచం అడిగితే సహించేది లేదని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హెచ్చరించారు. గూడూరు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్, సిబ్బంది తదితరులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సమస్యలపై ప్రశ్నించారు. పలు సర్టిఫికేట్ల మంజూరులో జాప్యం జరుగుతోందని, కారణాలు ఏమిటని ప్రశ్నించారు. సర్టిఫికేట్లు, ఇతర పనులు చేసి పెట్టేందుకు ప్రజల నుండి డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని సమావేశంలో ప్రస్తావించారు. ఇద్దరు వీ.ఆర్వోలపై ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు పనులు చేయలేకపోతే వెళ్ళిపోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, రహీమ్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాంగుల కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - సత్యవేడు: రాష్ట్రంలో దేవాంగ కుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, డైరెక్టర్ల నియామకం చేయాలని రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ గుత్తి త్యాగరాజు సీఎం చంద్రబాబు నాయుడుకు మెయిల్ ద్వారా విన్నవించుకున్నారు. సత్యవేడు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఈ విషయం వెల్లడించారు. ఈ సందర్భంగా గుత్తి త్యాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని కులాలకు కూటమి ప్రభుత్వం కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసిందని, దేవాంగ సంఘ కార్పొరేషన్ ఏర్పాటులో జాప్యం లేకుండా ఏర్పాటు చేయాలని సీఎంను కోరామని తెలిపారు. ఈ విషయాన్ని గతంలో అనేకసార్లు రాష్ట్ర కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కో కన్వీనర్ జక్కుల శివానందం పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగలో సోమవారం ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్‌ను కత్తి ధర్మయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో15,16,17,18 తేదీల్లో జరుగుతున్న అఖిలభారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభలకు దేశ నలుమూలల నుండి 209 దేశాల ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభలకి జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. తిరుపతి పట్టణంలో జరగనున్న భారీ ర్యాలీలో సిపిఐ పార్టీ శ్రేణులు, పార్టీ సంఘల కార్యకర్తలు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా జాయింట్ సెక్రెటరీ టి. నాగార్జున, విద్యార్థి యువజన నాయకులు మహేంద్ర మోహన్, అంకయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సమ్మర్ క్యాంప్ ముగింపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో త్రినేత్ర పిరమిడ్ పుత్తూరులో "ధ్యాన విద్యార్థి ప్రాజెక్ట్" వారిచే 11 రోజులు నిర్వహించబడిన ఉచిత సమ్మర్ క్యాంపు ముగింపు సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా గీతాచార్య డాక్టర్ యడ్లపల్లి మోహనరావు, చంద్రశేఖర్, జూనియర్ ఇంజినీర్, రైల్వేస్ తిరుపతి, డాక్టర్. ప్రసన్న తిరుచనూరు, రుషికేష్ చౌదరి ఆర్‌కేసి డెవలపర్స్ వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుచానూరు పిరమిడ్ స్పిరిట్యుయల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ జిబి ప్రసన్న మాట్లాడుతూ ధ్యానంతో ఉల్లాసవంతమైన జీవన విధానం సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లి దండ్రులు, పిరమిడ్ మాస్టర్లు సుబ్రహ్మణ్యం కార్యదర్శి, సుజాత, ప్రెసిడెంట్, టీమ్ సభ్యులు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగరాజ పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన ఎంపీపీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరత్నమ్మను, బుచ్చినాయుడు కండ్రిగ ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, సర్పంచి బూదూరు వెంకటమ్మ, సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు ఆరని విద్యానాథరెడ్డి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ మండల పరిధిలోని 28 పంచాయతీల్లో విద్యుత్, తాగు నీటి సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి ఎంపీడీవో కృషి చేయాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: భూముల రీ సర్వేతో భూసమస్యల పరిష్కారం అవుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శ్రీదేవి తెలిపారు. సోమవారం తిమ్మభోపాలపురంలో రెవెన్యూ అధికారులు రీ సర్వేకు సంబంధించి గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరూ భూముల రీసర్వేకు సహకరించాలన్నారు. తిమ్మ బోపాలపురంలో మొత్తం విస్తీర్ణం 386.78 ఎకరాలు ఉండగా, ఇందులో పట్టా భూములు 263.60 ఎకరములు, వీటిలో ప్రభుత్వ భూములు 123.18 ఎకరములు. ఈ భూమిలో మొత్తం సర్వే నంబర్లు 56. మొత్తం సర్వే నంబర్లకు గాను సబ్ డివిజన్ 909 మాత్రమే ఇందులో ప్రభుత్వ ఖాతాలో 9, నేషనల్ ఖాతాలో 76 ఉన్నాయని, కాబట్టి వచ్చే వారం నుండి గ్రామంలో రీ సర్వే మొదలవుతుందని రెవెన్యూ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్, డిటీ చంద్ర బాబునాయుడు, ఆర్ఎ నల్లయ్య, సర్వేయర్ రాజ్కుమార్, విఆర్‌లు పాల్గొన్నారు.

అమర జవాన్‌కు న్యాయవాదుల నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : దేశభద్రత కోసం వీరోచితంగా పోరాడి ప్రాణాలు వదిలిన, జవాన్ మురళి నాయక్ మృతికి పుత్తూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశ రక్షణ వైపు అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జ్ జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జ రమ్య సాయి, న్యాయవాదులు దినకర్, జానకిరామ్, మహిళ నాయకులు నదియా, శేషాచలం, పురుషోత్తం, సంజీవి, రామచంద్ర రెడ్డి, నాధముని పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 238 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటుగా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, శివశంకర్ నాయక్, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా రెవిన్యూ శాఖకు సంబంధించి 142 అర్జీలు వచ్చాయి. అనంతరం విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో చెవిటి, మూగ, అందులకు జిల్లా కలెక్టర్ సోమవారం లాప్ టాప్స్, స్మార్ట్ ఫోన్లు వంటి పరికరాలను అందించారు.

ట్రాఫిక్ సమస్య అధిగమించేది ఎలా..?

- వాహనాల రద్దీతో స్థానికులు నిత్యం సతమతం
- పరిష్కారానికి కసరత్తు శూన్యం
- ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో కార్వేటి నగర్ కూడలిలో ట్రాఫిక్ సమస్యతో పట్టణవాసులు సతమతమవుతున్నారు. ఈ సమస్యకు ట్రాఫిక్ పోలీసు వారు పరిష్కారం మార్గం చూపలేక పోతున్నారు. తిరుపతి జిల్లా పరిధిలోని పుత్తూరు మున్సిపాలిటీలో 27 వార్డులున్నాయి. దినదినాభివృద్ధి చెందుతూ నగరం విస్తరిస్తోంది. పట్టణవాసులు నిత్యం వావే వాహనాలు కాక, చిత్తూరు జిల్లా, గంగాధర్ నియోజకవర్గ పరిధిలో కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్ పురం, వడమాల పేట, నారాయణవనం, నగరి, నింద్ర విజయపురం, రైతులు పండించే పంటలు పుత్తూరు మార్కెట్‌కి వచ్చి అమ్ముకుని పోతుంటున్నారు. వ్యవసాయాని కావాల్సిన మందులు, ఎరువులకోసం నిత్యం రాకపోకలు జరుగుతుంటియి. దీంతో కార్వేటినగర్ కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. రెండు నెలల క్రితం అంబేద్కర్ సర్కిల్‌లో ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌ను లారీ ఢీకొట్టడంతో కంట్రోల్ రూమ్ నేలమట్టమయింది. తిరిగి భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. రోడ్లన్నీ ఎంత రద్దీగా ఉంటున్నా నగరంలో ఎక్కడా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయలేదు. దీనితో వాహనం నడిపే వారు ఇష్టానుసారంగా దూరేస్తుంటారు. ఉద్యోగులకు, విద్యార్థులకు సమయానికి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ట్రాపిక్ సిగ్నల్‌స ఏర్పాటు చేసి, రోడ్లపై రద్దీని అదుపులోకి తీసుకురావాలని ట్రిఫిక్ పోలీసులను స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

104, 108 వాహనాలకూ ఇబ్బందే

మూడు నియోజకవర్గాలకు కేంద్రంగా పుత్తూరు ఉండటంతో రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి. పట్టణంలో ఇంజనీరింగ్ కళాశాలలు, వివిధ పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు ట్రాఫిక్ సమస్యతో పరీక్షలప్పుడు ఇబ్బంది పడుతున్నారు.108,104 వాహనాల్లో ఆసుపత్రికి రోగులను తీసుకెళ్లాలన్నా సమస్యగానే ఉంటోంది.

- ఎస్సీ,ఎస్టీ జిల్లా కార్యదర్శి వై.నందయ్య

సిగ్నల్ పాయింట్స్ ఏర్పాటు చేయాలి

అత్యవసరంగా ఏదైనా పని నిమిత్తం వెళ్లాలంటే నగరంలో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. సిగ్నల్ పాయింట్స్ ఏర్పాటు చేస్తే వాహనాలు క్రమ పద్ధతిలో వెళుతుంటాయి.

- సిపిఎం జిల్లా నాయకులు ఆర్ వెంకటేష్

స్విమ్స్ ఇంటిట్యూటివ్ డేటా సోల్యూషన్స్‌తో ఒప్పందం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) పేషంట్ ఆరోగ్య సంరక్షణ కోసం విశాఖపట్నంకు చెందిన ఇంటిట్యూటివ్ డేటా సోల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారితో ఎంఓయు కుదుర్చుకున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలియజేశారు. ఒప్పంద పత్రాలపై స్విమ్స్ అధికారులు, ఇంటిట్యూటివ్ డేటా సోల్యూషన్స్ ఐడిఎస్ ఐఎస్సి సంస్థ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కళావత్, న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రమేష్ చంద్ర, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మన చేతిలోనే మన ఆరోగ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 50 సంవత్సరాలు దాటిన వారికి ఎముకలు సమస్యలు ఎక్కువగా ఉంటాయని, మన ఆరోగ్య పరిరక్షణ మన చేతుల్లోనే ఉందని తిరుపతి శ్రీ చక్ర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రాజేష్ తెలిపారు. పట్టణములోని స్థానిక కార్వేటి నగర్ రోడ్డులో ఉన్న విశ్రాంతి భవనములో విశ్రాంతి ఉద్యోగుల సంఘం సమావేశం అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశం లో సభ్యులు జిల్లా అధ్యక్షులు శంకర్, వెంకటకృష్ణ నాయుడు, ప్రధాన కార్యదర్శి కుప్పయ్య, బాలసుబ్రమణ్యం, అరుణాచలం, నిర్మలా జయ కుమారి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుని సన్నిధిలో కోనసీమ జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-ఏర్పేడు: గుడిమల్లం శ్రీ పరశు రామేశ్వర స్వామిని సోమవారం కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బత్తలగిరి నాయుడు, కార్య నిర్వాహణాధికారి కె.రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలను కొనసాగించండి

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఇతర పాఠశాలలకు బదిలీ విషయంపై సోమవారం ముస్లిం మత పెద్దలతో ఎంఈఓలు ఇందిరా దేవి, రంగనాథన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గత సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన విషయంపై చర్చించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఉర్దూ పాఠశాలను కొనసాగించాలని కోరుతూ ఎంఈఓలకు వినతి పత్రం అందించారు.

ప్రవేశ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి విశ్వం విద్యా సంస్థల ఆధ్వర్యంలో సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాలల 2026 ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఉచిత అవగాహన సదస్సు బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ అవగాహన సదస్సులో 4వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తప్పక పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి పాఠశాల యాజమాన్యం తెలియచేశారు. మరిన్ని వివరాలకు 86888 88802 / 9399976999 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

జోరుగా టీడీపీ సంస్థాగత ఎన్నికలు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే పులివర్తి నాని సూచనలతో చంద్రగిరి మండలంలో టిడిపి గ్రామ కమిటీ ఎన్నికలు జోరుగా సాగుతున్నాయి. ఆయా పంచాయితీల ఇన్చార్జి, నాయకులు కార్యకర్తలతో సమావేశమై గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన సంస్థగత ఎన్నికల్లో భాగంగా గంగుడుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులుగా వాసుదేవ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రాజశేఖర్, దోర్నగంబాల గ్రామ కమిటీ అధ్యక్షులుగా లోకేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బీగాల మహేష్ రాయల్, తొండవాడ గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఉమాపతి రెడ్డి, భీమవరం గ్రామ కమిటీ అధ్యక్షులుగా బొబ్బ రమేష్ కుమార్‌ను ఆయా గ్రామాలలోని నాయకులు కార్యకర్తలు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గౌస్ బాష, మండల ఉపాధ్యక్షులు తులసీశ్వర్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్ రాయల్, నారాయణరెడ్డి, మునిరత్నం రాయల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిజిక్స్ విద్యార్థికి కొరియాలో పరిశోధనావకాశం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో పీజీ పూర్తి చేసిన సిహెచ్ బ్రహ్మారెడ్డి అనే విద్యార్థికి విదేశాల్లో పరిశోధన చేయడానికి అవకాశం లభించింది. ఈ పరిశోధనలో భాగంగా బ్రహ్మారెడ్డికి నెలకు రూ. లక్ష రూపాయలు స్కాలర్షిప్ అందుకోనున్నారు. దక్షిణకొరియాలోని పూసన్ నేషనల్ యూనివర్సిటీలోని కెమికల్ మెటీరియల్స్ డిపార్ట్మెంట్లో ఆయన 3 సంవత్సరాలకు పైగా పరిశోధన చేయనున్నారు.

రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రేణిగుంట: రైల్వేలో పనిచేసి పదవీ విరమణ చేసిన పెన్షనర్ల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. సోమవారం రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి డాక్టర్ ఎస్ శ్రీధర్ , ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ అధ్యక్షులు, డాక్టర్ అత్తర్ సింగ్ ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట పెన్షనర్ అసోసియేషన్ బ్రాంచ్ చైర్మన్ అసన్ సాహెబ్, బ్రాంచి సెక్రెటరీ జి జయంత్ కుమార్, బ్రాంచ్ ట్రెజరర్ అన్బు, రేణిగుంట గ్రామ సర్పంచ్ ఆర్.నాగేశం, కృష్ణయ్య, కే.రంగయ్య, వి.రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితమూ ముఖ్యమే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వ్యాపారాభివృద్దే కాక, సమాజ హితమూ ముఖ్యమేనని ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్(ఈసీఎల్) స్పష్టం చేసింది. ఈసీఎల్ సంబంధిత సీఎస్ఆర్ నిధులను ఖర్చు పెట్టి శ్రీకాళహస్తి మండలం, తొండమనాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెగా ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. ఆ ప్లాంటును సోమవారం ఈసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖండేల్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డక్టైల్ ఐరన్ పైప్స్, ఫిట్టింగ్స్‌లో ప్రపంచ అగ్రగామిగా ఈసీఎల్ పేరొందిందని కొనియాడారు. వ్యాపారంతో పాటు సమాజాభివృద్ధి కూడా తమ సామాజిక బాధ్యతగా పరిగణిస్తూ నిరంతరం నిబద్ధతతో పనిచేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా తొండమనాడు ఉన్నత పాఠశాల యాజమాన్యం అభ్యర్థుల మేరకు మరో ఆలోచన లేకుండా 500 మంది విద్యార్థులకు నిరంతరం శుద్ధ జలాన్ని అందించే ఖరీదైన ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మంగళం సప్తగిరి కాలనీలో భూ వివాదం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం, సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీలో నకిలీ పత్రాలు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు తమ భూమిని కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తూ నిర్మాణాలను అడ్డుకుంటున్నారని మురళి అనే వ్యక్తి ఆరోపించారు. ఇదే గ్రామపంచాయతీ టిడిపి అధ్యక్షులుగా చెప్పబడే జడారెడ్డి భాస్కర్ రెడ్డి అనే వ్యక్తి నిర్మాణ పనులను అడ్డుకుంటూ ఈ స్థలం తాను కొన్నానని, రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నానంటూ ఆకతాయిలను వెంటబెట్టుకుని నిర్మాణాలను అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. నెల క్రితమే ఈ స్థలం కు సంబంధించి సదరు జడా భాస్కర్ రెడ్డికి ఎమ్మెల్యే పులివర్తి నాని పేదల ఇంటి స్థలాలకు వెళ్ళొద్దని, వారి స్థలాలను వారికి వదిలేయాలని సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. స్థల వివాదం నెలకొనడంతో ఇద్దరి రికార్డులు తీసుకొని తిరుచానూరు పోలీస్ స్టేషన్ కు రావాలని పోలీసులు సూచించారు.

తప్పు చేయకుంటే విచారణకు సహకరించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి గ్రామీణ మండలం తుమ్మలగుంట కెవిఎస్ పార్క్‌కు రూ.22 కోట్ల నిధులు ఎందుకు మళ్ళించారన్న విషయంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రజలను రెచ్చగొడుతున్నారని, తప్పు చేయకుంటే విచారణకు సహకరించాలని టిడిపి మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి సూచించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థకు రెండు పర్యాయాలు చైర్మన్‌గా పనిచేసి, నేడు కెవిఎస్ పార్క్‌ను తుడాకు అప్పగిస్తుంటే ఎందుకు అడ్డపడుతున్నారని ప్రశ్నించారు. విజిలెన్స్ విచారణలో పూర్తిస్థాయి వివరాలు త్వరలోనే వెలుగులోకి రానున్నాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గణపతి నాయుడు, కత్తి సుధాకర్, శ్రీనివాసులు, మునిశేఖర్ రాయల్, సుధా పాల్గొన్నారు.

ఆరేటమ్మ కల్యాణ మండపం ప్రారంభించిన ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని కూరపర్తివారిపల్లిలో వెలిసిన శ్రీ ఆరేటమ్మ ఆలయంలో సోమవారం మొలకల పౌర్ణమి ఉత్సవ వేడుకలు టిడిపి నాయకులు అన్నాసముద్రం మధు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విచ్చేశారు. అనంతరం టిడిపి నాయకులు మధు, ఎంపీటీసీ ఈశ్వరమ్మ దంపతులు రూ.50 లక్షలు సొంత నిధులతో నిర్మించిన ఆరేటమ్మ కళ్యాణ మండపాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, తహసిల్దార్ పరమేశ్వర స్వామి, మండల టిడిపి నాయకులు కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టారు.. కాసరం దళితుల ఆవేదన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తమపై అక్రమ కేసులు పెట్టారంటూ తొట్టంబేడు మండలం, కాసరం గ్రామానికి చెందిన దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రావెల్ తోలకాలపై తమకెలాంటి సంబంధం లేకున్నా అధికారులు తమపై అక్రమ కేసులు బనాయించారంటూ వాపోయారు. వ్యవసాయ ట్రాక్టర్లు ఉన్నంత మాత్రాన గ్రావెల్ దొంగలై పోతారా అంటూ ప్రశ్నించారు. వాస్తవాలను తెలుసుకోకుండా ఒక వర్గం చెప్పినట్లు కేసులు పెట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అసలైన గ్రావెల్ దొంగలను పట్టుకుని, మాపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ముక్కంటి సేవలో ఎమ్మెల్యే బాలరామకృష్ణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళ హస్తీశ్వరాల యానికి రాజనగరం ఎమ్మెల్యేబత్తుల బాలరామకృష్ణ సోమవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థ ప్రసాదాలను, జ్ఞాపికలను అందజేశారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని పలు గ్రామాలలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతోంది. ఎండి పుత్తూరులో సోమవారం రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులు పేదల నుండి 18 బస్తాలు సుమారు 800 కేజీలు బియ్యం కొనుగోలు చేసి ఆటోలో తరలించారు.

పదవి నుంచి తప్పుకుంటున్నాం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నూతనంగా ఏర్పాటయిన మున్సిపల్ సంఘం కార్యవర్గం నుంచి తప్పుకుంటున్నామని ఎన్నికైన సభ్యులు కొందరు రాజీనామా పత్రాలు సోమవారం కమిటీకి సమర్పించారు. వారిలో మునిసిపల్ ఇంజనీరింగ్ సెక్షన్, శానిటరీ సెక్షన్, టౌన్ ప్లానింగ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఉన్నారు. ముఖ్యంగా కమిటీ కార్యవర్గ కార్యదర్శి గోపి, ప్రధాన కార్యదర్శి ఎస్.మిధున్ చక్రవర్తి, మరి కొందరు సభ్యులు పదవి నుంచి తప్పుకుంటున్నామని కమిటీ అధ్యక్షులకు రాజీనామా పత్రం సమర్పించారు.

తక్కువ ధరకే స్నిక్కర్ యాప్ ద్వారా హోం సర్వీసులు: చైతన్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతిలో తక్కువ ధరకే ఇంటికి సంబంధించిన సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు స్నిక్కర్ యాప్ నిర్వాహకులు చైతన్య తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో స్నికర్ యాప్‌ను లాంచ్ చేసి, ఈ యాప్ ద్వారా ఇంటికి సంబంధించిన వస్తువులను శుభ్రపరచుకోవడానికి, సర్వీసు చేయించుకోవడానికి అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. ఈ యాప్ ద్వారా ఇంటిని శుభ్రపరచడం, మరుగుదొడ్లను శుభ్రపరచడం, ఎయిర్ కండీషనర్లను సర్వీసు చేయడం, ప్లంబింగ్ పనులు, ఎలక్ట్రికల్, కార్ వాష్ వంటి సదుపాయాలను అందుబాటులో ఉంచామన్నారు. 7799466684 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే ఈ సర్వీసులు చేయడానికి తమ సిబ్బంది అందుబాటులోకి వస్తారన్నారు. నిర్ణీతంగా గంట సమయానికి రుసుము చెల్లించేలా నిర్ణయించామన్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఈ యాప్ అందుబాటులో ఉందన్నారు.

పంచాయతీలకు త్రైమాసిక నిధులు విడుదల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలోని 33 మండలాల పరిధిలో ఉన్న 774 గ్రామపంచాయతీలకు 2025 -26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి త్రైమాసిక నిధులు రూ.1,46,10,233 రూపాయలను ప్రభుత్వం నుండి నేరుగా ఆయా గ్రామ పంచాయతీల సాధారణ నిధుల ఖాతాకు జమ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో తలసరి ఆదాయం(2024-25కి సంబంధించి) రూ.14,51,567 , వృత్తి పన్ను(2024-25కి సంబంధించి) రూ.35, 02, 383, సర్పంచుల గౌరవ వేతనం(2025-26కి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి)ఎన్నికలు జరిగినవి (745) రూ. 96,56,283 కలిపి జమ చేయబడ్డాయి.

క్రైం న్యూస్

కల్వర్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 30 మంది ప్రయాణికులకు గాయాలు
- డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, అగరాల వద్ద పూతలపట్టు- నాయుడు పేట జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు కలవర్టును ఢీకొనింది. ఈ ప్రమాదంలో 30 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. తిరుమల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, వేలూరు నుంచి ఆదివారం రాత్రి 40 మంది ప్రయాణికులతో తిరుపతికి వస్తుండగా 11.45 నిమిషాలకు బస్సు నడుపుతున్న డ్రైవర్ రాజారెడ్డి నిద్ర మత్తుతో కన్నుమూయడంతో బస్సు కల్వర్టు దిమ్మెను ఢీకొట్టగా భారీ శబ్దం వచ్చింది. బస్సు డ్రైవరు రాజారెడ్డి, కండక్టర్ హరికృష్ణలతో పాటు మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలినవారికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. డ్రైవర్ రాజారెడ్డి అమర హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. భారీ శబ్దానికి వాహనదారులు, స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకొని, ప్రయాణికులను బస్సులో నుంచి బయటికి దింపి, సమాచారాన్ని చంద్రగిరి పోలీసులకు అందజేశారు. చంద్రగిరి పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చంద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు 108 వాహనంలో తరలించారు. మరి కొంతమందిని నేషనల్ హైవే అంబులెన్స్ ద్వారా తిరుపతి రుయా హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో జరిమానా

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి, 8 మంది ముద్దాయిలను 4 వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతిలో హాజరు పరిచారు. జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం 8 మందికి రూ.80,000 జరిమానా విధించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కేశవులు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారి, చంద్రగిరి మండలంలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరుకు చెందిన డి.ఎం. కోదండ రామన్ (72) ఆదివారం రేణిగుంట లోని అమర రాజాకు చెందిన వస్తువులను లారీలో లోడ్ చేసుకుని బంగారుపాళ్యం బయలుదేరాడు. మార్గమధ్యమంలో చంద్రగిరి మండలం, పనపాకం, గాదంకి టోల్ ప్లాజా వద్ద ఆపి లారీకి పక్కన నిలబడి ఉండగా తిరుపతి వైపు నుండి చిత్తూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా కోదండరామన్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆయన కింద పడి తల, కాలుకి తీవ్ర రక్త గాయాల య్యాయి. టోల్ ప్లాజా సిబ్బంది వారి 108 వాహనంలో చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం ఆయన మృతి చెందారు. చంద్రగిరి మండలం అగరాలకు చెందిన డి.కేశవులు సోమవారం ఉదయం నిద్ర లేచి బహిర్భూమికని తన ఇంటికి సమీపంలోనే ఉంటున్న జాతీయ రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఆయనను ఢీకొనగా తీవ్ర రక్త గాయాలై కేశవులు అక్కడక్కడే మృతి చెందాడు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి, ఎస్సై అనిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరెంటు తీగలు తగిలి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : విఎల్ఆర్ లాజిస్టిక్ కొరియర్ సంస్థకు చెందిన మినీ లారీ ప్రమాదవ శాత్తు కరెంటు వైర్లు తగిలడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఐరాల మండలం, మద్దిపట్లవారిపల్లికి చెందిన ఈశ్వర్ (50) విఆర్ ఎల్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తిరుపతి ఎస్‌జిఎస్ కాలేజి వద్ద అన్లోడింగ్ అయిన లారీని పార్కింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు లారీకి తగలడంతో కరెంటు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి విద్యుత్ సరఫరాను నిలిపేసి, మృతదేహాన్ని పక్కకు తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికీ చేరుకొని, ప్రమాదతీరుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి రుయా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిపై నివేదిక ఇవ్వండి : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి గ్రామీణ మండలం అవిలాల గ్రామపంచాయతీలో ఈనెల 7వ తేదీన సాయంత్రం పంచాయతీ కార్మికులుగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తుండగా, స్థానికులు కొందరు మద్యం మత్తులో దాడి చేసి పంచాయతీ కార్మికులను కొట్టారని, దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని జిల్లా కలెక్టర్‌కు పంచాయతీ కార్మికులు వినతి ఇచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవిని పిలిచి పూర్తి నివేదిక ఇవ్వాలంటూ ఆదేశించారు. పంచాయతీ కార్మికులపై జరిగిన దాడిని వాస్తవ పరిస్థితులను తెలుపుతూ లేక ఇవ్వాలని డిపిఓ అవిలాల గ్రామపంచాయతీ కార్యదర్శికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి అలేఖ్య జరిగిన వాస్తవ విషయాలను లేక రూపంలో అధికారులకు అందించారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి

మృతి చెందిన తుపాకుల మణి, గులాబ్

ప్రజాశక్తి - నాగలాపురం: 2 ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందిన ఘటన నాగలాపురం మండలం బయట కొడియంబేడులో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ సునీల్ చెప్పిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఊతుకోట-పుత్తూరు నేషనల్ హైవే రోడ్డులో బయట కొడియం బేడు ఎస్టీ కాలనీకి తిరుగు క్రాస్ వద్ద ఎండి గులాబ్ (22) పంచర్ షాపు పెట్టుకుని జీవిస్తున్నాడు. అతను బీహార్ రాష్ట్రానికి చెందిన వైశాలి జిల్లా దుర్గాపూర్ గ్రామవాసి. హీరో స్ప్లెండర్‌లో అచ్చమ్మనాయుడు కండ్రిగ డాబాలో భోజనం చేసి పంచర్ షాపు వద్దకు వెళుతుండగా, బయట కొడయంబేడు ఎస్టీ కాలనీకి చెందిన తుపాకుల మణి (38) హీరో స్ప్లెండర్‌లో పిచ్చాటూరు మండలం రామగిరి ఎస్టీ కాలనీకి వెళ్లి తిరిగి గ్రామానికి వెళుతుండగా ఢీకొన్నాయి. ఇద్దరూ వేగంగా రావడం వల్ల ఘటనా స్థలంలోనే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడుకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సేవలో మంత్రులు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం బయట కొల్లురవీంద్ర మాట్లాడుతూ చంద్రబాబుకు స్వామి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించానన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలో ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ ఏవి బ్రహ్మానంద రెడ్డి కోరారు. రామచంద్రాపురం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో ఇందిర నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తమ శాఖల ద్వారా నిర్వహిస్తున్న పనులు, ప్రగతి గురించి వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులలో ఫారం ఫాండ్ వంటి పనులను యంత్రాలతో నిర్వహించడం చేయకూడదని అలా చేసి మండలానికి అవినీతి మరక తీసుకురావద్దని ఏపీఓకి సూచించారు. అదేవిధంగా గ్రామాలలో తాగునీటి ఎద్దడికి ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ శాఖలో పనిచేసే సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని పలువురు సర్పంచులు సభ దృష్టికి తీసుకొని వచ్చారు. ట్రాన్స్కో ప్రతినిధి మాట్లాడుతూ సిబ్బందిని సమన్వయం చేసి పంచాయతీలలో ఎలాంటి విద్యుత్ అవరోధాలకు తవు లేకుండా చర్యలు తీసుకుంటామని సభకు హామీ ఇచ్చారు. ఆబ్కారి శాఖ ప్రతినిధి మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కడ కూడా నాటు సారాయి లేకుండా నిషేధించామన్నారు. తాసిల్దారు వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలలో ఇండ్లు నిర్మించుకున్న వారు వాటిని రెగ్యులర్ చేసుకోవటానికి ఇప్పటికే పలువురు దరఖాస్తు చేసుకుని ఉన్నారని ఇంకను ఎవరైనా దరఖాస్తు చేసుకోదలిస్తే చేసుకోవాలని చెప్పారు.

నూతన రేషన్ కార్డులు మంజూరుకు ప్రభుత్వం ఆన్లైన్ లో దరఖాస్తుల నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చిందని అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఎంపీపీ కోరారు. అదేవిధంగా గర్భిణీలకు చిన్న పిల్లలకు మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అందించే పౌష్టికాహారాన్ని వేసవి తాపం వలన ఉదయం పూట పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా అందరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ ప్రతినిధి శంకర్ నాయుడు మాట్లాడుతూ గత సమావేశంలో కొందరు ప్రజాప్రతినిధులు కోరిన విధంగా బస్సు సౌకర్యం ఒక వారం రోజులు లోపల కల్పించినట్లు తెలియజేశారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండలాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్దామని జడ్పిటిసి ఢిల్లీ రాణి కోరారు. మండలంలో పలు అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించి అనుమతుల కోసం పంపామని ఎంపీడీవో ఇందిరా తెలియజేశారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీలు వైస్ యుంటిని లావణ్య, చంద్రశేఖర్ రెడ్డి, మునీంద్ర బాబు, మంజుల, కృష్ణవేణమ్మ, ఎద్దుల రాజేష్, కోఆప్షన్ సభ్యులు రాజేంద్ర సర్పంచులు శ్రీవ్య వేణుగోపాల్, భారతి, మురగయ్య, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తిరుత్తణిలో నేడు జనసేన పూజలు

తన నివాసంలో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆపరేషన్ సింధూరంలో పోరాడుతున్న సైనికులకు దైవ బలం మెండుగా ఉండాలని మంగళవారం ఉదయం 8 గంటలకు తిరుత్తణి సుబ్రమణ్య స్వామిని దర్శించుకుని ప్రార్థించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన నివాసంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. తిరుత్తణి సుబ్రమణ్యా స్వామి దర్శనానికి జనసేన నాయకులు, వీరమహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు. తిరుపతి నుంచి మంగళవారం ఉదయం 6 గంటలకు బస్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహం సర్కిల్ నుంచి వాహనాల్లో తిరుత్తణికి బయలుదేరనున్నట్లు ఆయన చెప్పారు. తిరుత్తణి సమీప నియోజకవర్గాల నుంచి జనసేన నాయకులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. కాగా పహల్గాం లో 26 మందిని ఉగ్రవాదులు పొట్టనపెట్టుకోవడం జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను కలిచివేసిందని ఆయన తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో మన సైనికులకు పోరాడే శక్తి సామర్థ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా భగవంతుని ఆశీస్సులు ఉండాలన్న సంకల్పంతో మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్నాటక లోని 13 ఆలయాల్లో మంగళవారం జనసేన ప్రజాప్రతినిధులు పూజలు నిర్వహించి ప్రార్థించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించినట్లు ఆయన చెప్పారు. ఆపరేషన్ సింధూరం సక్సెస్ అయినప్పటికి కపటత్వానికి మారుపేరైన పాకిస్థాన్‌ను భవిష్యత్‌లో దాడులు దిగినా సైనికులకు దైవబలం మెండుగా ఉండాలనే సదుద్దేశంతో ఈ పూజలు నిర్వస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకునే నిర్ణయాలకు జనసేన పూర్తి మద్ధతు ఇస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజా రెడ్డి, అనీల్ రాయల్, బాబ్జీ, సుధాకర్, ఆముదాల వెంకటేష్ తదితరలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ గోవిందరాజస్వామివారి పొన్నకాల్వ ఉత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వైశాఖ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ గోవిందరాజస్వామివారి పొన్నకాల్వ ఉత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు ఆలయం నుండి శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి, ఆండాల్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామి, విష్వక్సేనులవారు తొమ్మిది మంది దేవేరులతో ఊరేగింపుగా తనపల్లి రోడ్డులో గల పొన్నకాల్వ మండపానికి ఊరేగింపు చేరుకున్నారు. ఉదయం 9 నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు శ్రీగోవిందరాజస్వామివారు అక్కడినుండి బయలుదేరి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. రాత్రి 9.30 గంటలకు తిరిగి శ్రీ గోవిందరాజస్వామి ఆలయానికి చేరుకోవడంతో పొన్నకాల్వ ఉత్సవం ముగుస్తుంది. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్, చిన్న జీయంగార్లు, ఆలయ డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈఓ ముని కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ లు ఎ.వి.శేషగిరి, చిరంజీవి, ఆలయ ఇన్స్పెక్టర్‌లు యు.ధనుంజయ, రాధాకృష్ణ ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా చిత్ర పౌర్ణమి పూజలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం, రామగిరి, శ్రీ అంకాలపరమేశ్వరి ఆలయంలో సోమవారం చిత్ర పౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌కు భక్తులు పాలాభిషేకం చేశారు. సాయంత్రం 7 గంటలకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించారు.

వైభవంగా వైశాఖ పౌర్ణమి గరుడసేవ

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో ఆదివారం రాత్రి 7 గంటలకు వైశాఖ పౌర్ణమి గరుడసేవ అత్యంత వైభవంగా ప్రారంభమై రాత్రి 9గంటల వరకు జరిగింది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా గరుడసేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకోవడంతో తిరుమాడ వీధులు గోవిందనామ స్మరణతో మార్మోగాయి. ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో నాలుగుమాడ వీధులలో భజనలు, కోలాటాలు, చెక్క భజనలు కోలాహలంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చినజీయర్ స్వామి, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అన్నమయ్య సంకీర్తనలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : అన్నమయ్య సంకీర్తనలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్య 617 జయంతి వేడుకలు తిరుపతి అన్నమయ్య కళా మందిరంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. తాళ్లపాక లోని ధ్యానమందిరంలో ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం నిర్వహించారు. రాజంపేటలో 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద సాయంత్రం ఊంజల్ సేవ, హరికథ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

రాయితీ పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం : రాష్ట్రంలోని పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కమ్మపల్లి, కుప్పం బాదూరు పశు వైద్యశాలల పరిధిలో 50% రాయితీతో పశువుల దాణాను ఎస్సీ ఎస్టీ రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోరా హరిప్రసాద్, బాదురు ధనుంజయులు, చేకూరి వెంకట ప్రసాద్, శేఖర్ నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, మధు బాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిరంజీవి, సురేంద్ర నాయుడు, ఎస్సీ ఎస్టీ రైతులు పాల్గొన్నారు.

ఈ స్మార్ట్ లాప్ టాప్ ఎంతో ఉపయోగం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తమకు అందిచిన ఈ స్మార్ట్ లాప్ టాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని శ్రావణి, కాసారం గ్రామం, శ్రీకాళహస్తి నియోజకవర్గం, కాసారం గ్రామానికి చెందిన శ్రావణి తెలిపారు. ఇందులో నాన్ విజిబుల్ డెస్క్ టాప్ యాక్సెస్ (ఎన్విడిఎ) ఉండడంతో స్క్రీన్ పై ఉన్న డేటాను అది రీడ్ (చదవడం) చేస్తుందన్నారు. దీనితోపాటుగా జాస్ అనే మరో యాప్ మాకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ యాప్ లను 3, 5, 9 నెలల కోర్సు ద్వారా నేర్చుకోవచ్చని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో చేనేత కార్మికుడు మృతి

మృతి చెందిన రాజేంద్ర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక గేట్ పుత్తూరు, ఓల్డ్ వీవర్స్ కాలనీకి చెందిన రాజేంద్ర(35), అతని తమ్ముడు సోమవారం రాత్రి విద్యుత్ షాక్ గురయ్యారు. ఈ ఘటనలో రాజేంద్ర మృతి చెందగా, అతని తమ్ముడికి చిన్నపాటి గాయాలయ్యాయి. చేనేత కార్మికుడు రాజేష్ మర మగ్గం నేస్తూ.. చిన్నపాటి రిపేరు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. స్థానికులు గుర్తించి హుటా హుటిన పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రాజేంద్ర మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసే దర్యాప్తు చేపట్టారు.

గంగమ్మ ఆలయం ముందు డప్పల కోలాహలం..